కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడుతాం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

యాచారం, జూన్30: ప్రజాసమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఎం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండలంలోని తమ్మలోనిగూడ గేటు వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. త్వరలో ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ఉద్యమాలతో సీఎం రేవంత్‌రెడ్డి మెడలు వంచుతామన్నారు. కేంద్రంలో బీజేపీ అరాచక పాలనను ప్రజాఉద్యమాల ద్వారా ఎండగడుతామని చెప్పారు. ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సీపీఎంకు మండలంలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పుంజుకునేలా చూడాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కార్మిక, కర్షక, పేదల సంక్షేమాలను విస్మరించాయన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటాలు చేసామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకులు రాములు, జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, సీహెచ్ జంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు సామేల్, అంజయ్య, మండల కమిటీ సభ్యులు బ్రహ్మయ్య, ఆలంపల్లి జంగయ్య, చందునాయక్, జగన్, మల్లేశ్, వెంకటేశ్, వినోద్, శ్రీమన్నారాయణ, తావునాయక్, జంగయ్య, భూషన్ పాల్గొన్నారు.

ఎస్పీ బాలు జీవితం ఆదర్శప్రాయం

పెద్దఅంబర్‌పేట, జూన్ 30: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జీవితం ఆదర్శప్రాయమని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ప్రముఖ సంగీత గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతిని ఆదివారం మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని స్పందన సొసైటీలో నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డితో కలిసి కార్యక్రమాన్ని శ్రీనివాస్‌గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహంలో ఉన్న ప్రతి చిన్నారికి బాలు జీవితం ఆదర్శమని, కిందిస్థాయి నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రపంచంలోనే అత్యుత్తమ గాయకుడిగా ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, చామ విజయ్‌శేఖర్‌రెడ్డి, దైవజ్ఞ శర్మ, స్పందన నిర్వాహకులు ఉత్తమ్‌కుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి తదితరులు

కార్యక్రమంలో పాల్గొన్న 2008-09 విద్యాసంవత్సరం విద్యార్థులు

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

యాచారం, జూన్30 : మండలంలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-01 విద్యాసంవత్సరంతో పాటుగా 2008-09 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం వేర్వేరుగా కనుల పండువగా జరిగింది. పాఠశాలలో కలిసి చదువుకున్న మేడిపల్లి, మల్కీజ్‌గూడ, నానక్‌నగర్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ద్వారా కొన్ని సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆ విద్యా సంవత్సరం తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

దేవునిఎర్రవల్లిలో..

చేవెళ్ల రూరల్ : 1996-97 సంవత్సరంలో ఊరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 27 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం దేవునిఎర్రవల్లి గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన 1990-01 విద్యాసంవత్సరం విద్యార్థులు

చేవెళ్ల రూరల్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

కొండాపూర్, జూన్ 30 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారులు భరతనాట్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆర్‌కేఎస్ కళా నిలయం గురువులు సుందరి రవిచంద్ర శిష్య బృందం నృత్యాంజలి, గజానన యుతం, అలరిపు, పంచముఖి కౌతం, శబ్దం, వర్ణం, నర్సింహ కౌతం, భో శంభో, గోవర్ధన గిరిధారి, తక్కువేమి మనకు, అంబా శాంభవి, కళింగ తిల్లాన అంశాలను నివేదిత, పావని, శ్రేయ, వరుని, ప్రవళిక, కిర్మణయి, ఆద్విక, హాసిని, నిధి, అగర్త, గోద్విజ భరతనాట్య రూపకంలో నర్తించి ఆకట్టుకున్నారు.

ప్రారంభానికి నోచుకోని అతిథిగృహం

ప్రారంభమెప్పుడో..?

వృథాగా ఉన్న గెస్ట్‌హౌస్
శిథిలమవుతున్న ఫర్నిచర్
పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
వినియోగంలోకి తేవాలని స్థానికుల విజ్ఞప్తి

యాచారం, జూన్ 30 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన అతిథి గృహం (గెస్ట్ హౌస్) కొంతకాలంగా ప్రారంభానికి నోచుకోకుండా పోతుంది. దీనిని నిర్మించి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ప్రారంభించక పోవడం గమనార్హం. దీంతో అతిథి గృహం ప్రారంభ మెప్పుడోనని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. మండల కేంద్రంలో ఎనిమిదేండ్ల క్రితం అప్పటి జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. మండలంలో అతిథి గృహం లేదని గమనించిన ఆమె, భవనం నిర్మాణం కోసం రూ. 15లక్షల జడ్పీ నిధులను మంజూరు చేశారు. అప్పటి జడ్పీటీసీ రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులు సరిపడా లేకపోవడంతో పూర్తి స్థాయి మరమ్మతుల కోసం రూ. మరో రూ. 1.20లక్షల నిధులను అదనంగా విడుదల చేశారు. మొదట్లో భవన నిర్మాణం పూర్తయినప్పటికీ అతిథి గృహంలో ఫర్నిచర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రారంభానికి నోచుకోకుండా పోయింది. దీంతో భవనంలో కుర్చీలు, సోపాలు, మంచం, తదితర వస్తువులతో పాటుగా కిటికీలు, గ్రిల్స్, పెయింటింగ్ సైతం వేశారు. అయినప్పటికీ అది ప్రారంభానికి నోచుకోకుండా పోయింది. యాచారం గ్రామం నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉండటంతో ఎంతో మంది ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు జోరుగా రాకపోకలు కొనసాగిస్తారు. ముఖ్యంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పలు పార్టీల ముఖ్యనాయకులతో పాటుగా, వీఐపీ అధికారులు సైతం ప్రయాణిస్తుంటారు. వారికి అందుబాటులో అతిథి గృహం లేకపోవడంతో నిత్యం అనేక ఇబ్బందులు పడుతుంటారు. ముఖ్యంగా మహిళలు మరిన్ని అవస్థలు పడుతుంటారు. వారు విశ్రాంతి తీసుకోవడంకోసం, రాత్రిపూట బస చేయడంకోసం మండల కేంద్రంలో అతిథి గృహ నిర్మాణం చేపట్టారు. అతిథి గృహాన్ని నిర్మించారు కానీ అది నేటికి ప్రారంభానికి నోచుకోకుండా పోతుంది.

శిథిలావస్థకు చేరుకుంటున్న ఫర్నిచర్

అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కుర్చీలు, సోపాలు, మంచాలు తదితర ఫర్నిచర్ ఉపయోగంలో లేకపోవడంతో పూర్తిగా చెడిపోతున్నాయి. అవి బూజు, చదలు పట్టి క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటర్ ట్యాంకు నీటి కనెక్షన్‌లేక నిరుపయోగంగా మారింది. భవనంలోని కిటికీలకు గ్లాస్‌లు అమర్చకపోవడంతో గదులు దుమ్ము, దూలి, చెత్తా చెదారంతో నిండిపోయాయి. మరికొన్ని నిధులను మంజూరు చేస్తే భవనాన్ని ప్రారంభించవచ్చని పంచాయతీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అతిథి గృహంలో శిథిలావస్థకు చేరుకుంటున్న ఫర్నిచర్

వెంటనే ప్రారంభించాలి

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన అతిథి గృహాన్ని వెంటనే ప్రారంభించాలి. ప్రభుత్వం మరిన్ని నిధులను మంజూరు చేసి అతిథి గృహంలో సరిపడా ఫర్నిచర్, తదితర పనులను పూర్తి చేయాలి. ప్రారంభోత్సవ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలి. అతిథి గృహాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలి. అతిథులకు అన్ని వసతులతో కూడిన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. దీనిపై ఉన్నతస్థాయి అధికారులు స్పందించాలి.

- మహ్మద్‌గౌస్, మాజీ వార్డు సభ్యుడు యాచారం

ఓయూలో ల్యాండ్ స్కేపింగ్

సిటీబ్యూరో,జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నగరంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, రోడ్ల వెంబడి చెట్లను పెంచడం ద్వారా పచ్చదనాన్ని పెంచేందుకు హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ విభాగం పనిచేస్తోంది. అందులో భాగంగా కోర్ సిటీలో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో సుమారు రూ. 86.92 లక్షలతో ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాంతాలను హెచ్ఎండీఏ అధికారులు యూనివర్సిటీకి వెళ్లి పరిశీలించి, ల్యాండ్ స్కేపింగ్ పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామని, త్వరలోనే ల్యాండ్ స్కేపింగ్ పనులు మొదలు పెడతామని అధికారులు తెలిపారు.

మెడికవర్‌లో ఉమెన్స్ ఆంకాలజీ

గ్లోబల్ సమ్మిట్

కొండాపూర్, జూన్ 30: స్త్రీ జననేంద్రియ, రొమ్ము క్యాన్సర్, చికిత్స విధానాలపై అవగాహన కల్పించేందుకు హైటెక్ సిటీలోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో 'ఉమెన్స్ ఆంకాలజీ'పై ఆదివారం గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ శాంత కుమారి, డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ రవిచందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సమ్మిట్‌ను ప్రారంభించారు. సదస్సులో భాగంగా మహిళలు ఎదుర్కొనే ఎండోమెట్రియల్, గర్భాశయ, రొమ్ము, అండాశయ క్యాన్సర్‌లపై ఆంకాలజీ నిపుణులు చర్చించారు. క్యాన్సర్ నివారణలో తాజా పరిశోధన ఫలితాలు, వినూత్న చికిత్స పద్ధతులపై చర్చించారు. కార్యక్రమంలో వివిధ దవాఖానల నుంచి విచ్చేసిన 200 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

ఫొటో తెచ్చిన తంటా..

వనమహోత్సవ కార్యక్రమంలో ఫొటోలు దిగుతుండగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య గొడవ.. పరస్పరం ఫిర్యాదులు
ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఉండగానే దాడులు

వన మహోత్సవం వద్ద గొడవపడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

బండ్లగూడ,జూన్ 28 : వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మేయర్‌తో కలిసి ఫొటోదిగే విషయమై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వివాదం చోటుచేసుకుని పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఇదంతా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అక్కడ ఉండగానే జరగడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం వన మహోత్స కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. దీనిని మేయర్ లతా ప్రేమ్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేతో కలిసి మేయర్, అధికారులు మొక్కలు నాటుతూ ఫొటో దిగుతున్నారు. అయితే.. బీఆర్ఎస్ నేత మల్లేశ్.. మేయర్‌కు అడ్డుగా నిలబడి ఫొటో దిగుతుండగా అడ్డుగా ఉండవద్దని అక్కడి కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌గౌడ్‌కు, కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్లు చంద్రశేఖర్,శ్రీనాథ్‌రెడ్డిల మధ్య గొడవ జరిగి.. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. అనంతరం ఇరువురు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే.. ఆ గొడవ అంతా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఉండగానే జరిగింది.

నాకు ప్రాణహాని ఉంది : హరీశ్‌గౌడ్

ఫిర్యాదు అనంతరం బీఆర్ఎస్ నేత హరీశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. తాను స్థానికంగా చేస్తున్న సేవలను చూసి కాంగ్రెస్ నేతలు ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. పోలీసుల సాక్షిగా తనను ఇష్టానుసారంగా బెదిరించారని ఆరోపించారు. వారినుంచి తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే.. తమపై అకారణంగా దాడులు చేశారని కార్పొరేటర్లు చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డిలు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది

ఉపాధ్యాయుడు ప్రభుదయాళ్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

షాబాద్, జూన్ 30: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని విశ్రాంత ఉపాధ్యాయులు బర్క నర్సింహులు, రాంరెడ్డి అన్నారు. షాబాద్ మండలంలోని తాళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రభుదయాళ్ దంపతులను ఆదివారం నాగరగూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు నర్సింహులు, రాంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. ప్రభుదయల్ అంకితభావంతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, జంగయ్య, శేఖర్, ఇస్మాయిల్, రాజశేఖర్‌రెడ్డి, కుమార్, పరమేష్, అమృత పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్దఅంబర్‌పేట, జూన్ 30: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలో ఆదివారం ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్ ఆధ్వర్యంలో నీలాద్రి హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. గ్రామస్తులకు బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. రక్తదానంతో ప్రాణదాతలు కావాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

21న అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీలు

ఖైరతాబాద్, జూన్ 30:షావోలిన్ టైగర్స్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఇండియన్ ఆల్ స్టయిల్ కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ వ్యవస్థాపకుడు మద్ది కన్నన్‌గౌడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్ తల్వార్, సినీ నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు.

క్రికెట్ బెట్టింగ్.. ఇద్దరి అరెస్ట్

రూ.25.55లక్షలు సీజ్

సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.25.55లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, లాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...ఐఎస్ సదన్ పీఎస్ పరిధిలోని మారుతీ నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సోహెల్, ఎండి.ఫర్హతుల్లాతో కలిసి భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్‌కప్ 2024పై క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా పంటర్ల నుంచి గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారు. కొన్నిసార్లు ఏజెంట్‌గా వ్యవహరించే ఫర్హతుల్లా నేరుగా వెళ్లి పంటర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తుంటాడు. కాగా.. ఈనెల 29న క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతుండగా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.25.55లక్షల నగదు, సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై లైంగికదాడి..10 మంది అరెస్టు

నేరేడ్‌మెట్, జూన్ 30: బాలికపై అత్యాచారం కేసులో 10మంది నిందితులను ఆదివారం నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనోపాధిపొందుతున్న ఓ మహిళకు ముగ్గురు కుమార్తెలు . రెండో కుమార్తె (12)కు వినాయకనగర్‌కు చెందిన చక్కొల్ల నరేశ్ (26), సిరిపంగ విజయ్‌కుమార్ (23)లు మత్తుమందు అలవాటు చేశారు. ఈక్రమంలో పలుమార్లు బాలికను వినాయకనగర్‌కు తీసుకొచ్చి కూల్‌డ్రింగ్‌లో మత్తుమందు కలిపి తాగించి 8మంది మిత్రులతో కలిసి వారు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో బాలిక అనారోగ్యానికి గురికాగా, తల్లి దవాఖానకు తీసుకువెళ్లగా.. గర్భవతి అని తేలింది. వెంటనే బాలిక తల్లి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. కేసు విచారణ చేపట్టి.. నిందితులు నరేశ్,విజయ్‌కుమార్, దినకర్‌నగర్‌కు చెందిన బాలి (23), దీపక్ (25), సింహాద్రి నగర్‌కు చెందిన కృష్ణ (22), వినాయకనగర్‌కు చెందిన కిరణ్ (26), ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన అజయ్ (23), సాయినాథ్‌పురంకు చెందిన జేమ్స్ (24), ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన మధు (30), ఆర్టీసీ కాలనీకి చెందిన బాలు (25)లను గుర్తించి 10మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిలో 7మంది నిందితులపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు.

జల సంరక్షణను ఉద్యమంగా చేపట్టాలి

కొండాపూర్, జూన్ 30: జల సంరక్షణను ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీశ్ రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు సమీపంలో డాక్టర్స్ డేను పురస్కరించుకుని 'ఇగ్నైటింగ్ మైండ్స్, వాక్ ఫర్ వాటర్' ఆధ్వర్యంలో ఆదివారం 5కే వాక్‌ను నిర్వహించారు. ఇందుకు డా.సతీశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఖాదీ బోర్డు సభ్యులు పేరాల శేఖర్ రావు, సింగరేణి సీఎండీ బలరామ్, ఐఎంఏ నూతన అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డిలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని, ప్రతి చుక్క వాన నీటిని ఒడిసి పట్టడాన్ని ఉద్యమంగా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. జల సంరక్షణతోనే భూగర్భ జలాల పెంపు సాధ్యమవుతుందన్నారు. పర్యావరణం దెబ్బతినడం కారణంగానే అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. వాక్‌లో 200లకు పైగా వైద్యులు పాల్గొని 5కే నడిచారు. అనంతరం వాక్‌లో పాల్గొన్న వారిని మెడల్స్‌తో సత్కరించారు.

ఓఆర్ఆర్ మీదుగా గంజాయి రవాణా..

ముగ్గురు అరెస్టు.. 33 కిలోలు స్వాధీనం

కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీలు కోటిరెడ్డి, శ్రీనివాస్

కుత్బుల్లాపూర్, జూన్ 30 : ఏపీ, రాజమహేంద్రవరం నుంచి నగరానికి గంజాయి తరలిస్తున్న ముఠాను సైబరాబాద్ ఎస్ఓటీ, శామీర్‌పేట్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 33 కిలోల గంజాయితోపాటు రూ.50వేల నగదు, నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పేట్ బషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఎస్ఓటీ సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్‌లు వివరాలు వెల్లడించారు. ఏపీ, ఏలూరుకు చెందిన గేదెల సతీశ్, గన్నవరానికి చెందిన కోరాడ సాయికుమార్, బండారు శివకుమార్‌లు ఒడిశా నుంచి దిగుమతి చేసుకున్న ఎండు గంజాయిని ఏపీ, రాజమహేంద్రవరం నుంచి ఓఆర్ఆర్ మీదుగా నగరానికి తీసుకొస్తున్నారు. సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ టీంతో పాటు శామీర్‌పేట్ పోలీసులు ఈ నెల 28న శామీర్‌పేట్‌లోని ఓఆర్ఓర్ టోల్‌గేట్ వద్ద బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా.. 33 కిలోల ఎండు గంజాయి లభించింది. వెంటనే ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని..గంజాయిని స్వాధీనం చేసుకుని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్ఓటీ టీంతో పాటు శామీర్‌పేట్ పోలీసులను డీసీపీలు అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ శోభన్‌కుమార్, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్‌తో పాటు ఎస్ఓటీ టీం, శామీర్‌పేట్ పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా.. 31.2కిలోలు సీజ్

సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టుచేశారు. నిందితుడి వద్ద నుంచి 31.2కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌తో పాటు మారుతీ 800కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని విజయవాడకు చెందిన బోయినిపల్లి సురేశ్ సులభంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి రవాణా చేస్తున్నాడు. గంజాయి ప్యాకెట్లను ప్రత్యేకంగా తయారు చేసిన గ్యాస్ ట్యాంక్‌లో పెట్టి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు ఆదివారం నాగోల్ ఠాణా పరిధిలో అతడిని తనిఖీ చేయగా.. రూ.8.5లక్షల విలువ చేసే 31.2కిలోల గంజాయి లభించింది. వెంటనే అతడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.